





# పరిశ్రమ లేదు.. ఉద్యోగమూ రాలేదు

- 16 ఏళ్లు అయినా ఏర్పాటుకాని జిందాల్ ఫ్యాక్టరీ
- తీవ్ర ఆవేదనలో నిర్వాసితులు
- భూమి లేక.. ఉపాధి కానరాక కష్టాలు
- ఏడాదిగా ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణమంటూ కొత్తపల్లవి
- సీఎం శంకుస్థాపనకు వస్తున్నారంటూ హడావిడి
- తాజా పరిణామాలపై నిరసనగా నిర్వాసితుల రిలే దీక్షలు

పాపం నిర్వాసితులు.. తమ గ్రామంలో జిందాల్ పరిశ్రమ వస్తే ఉద్యోగమొస్తుందని సంబరపడ్డారు. పరిహారం కూడా చెల్లిస్తామనడంతో మరో ఆలోచన లేకుండా జీవనోపాధి చూపుతున్న భూమిని ఇచ్చేశారు. అందిన కాస్త డబ్బులను ఏడాదిలోపే ఖర్చు చేసేశారు. ఇక అప్పటి నుంచి పరిశ్రమ కోసం.. అందులో ఉద్యోగం కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని చూస్తూ వచ్చారు. అలా 16 ఏళ్లు గడిచిపోయాయి. ఆశ పోయింది.. ఆవేదనే మిగిలింది. ఇప్పటివరకూ పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా ఏడాదిగా పారిశ్రామిక పార్కు నిర్మాణమంటూ జిందాల్ యాజమాన్యం కొత్తపల్లవి అందుకుంది. ప్రారంభానికి సీఎం వస్తున్నారంటూ కొద్దిరోజులుగా హడావిడి చేస్తోంది. ఈ పరిణామాలపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రిలే దీక్షలకు దిగారు. బొడ్డవర వయా తాటిపూడి-విజయనగరం రోడ్డు పక్కన నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. జిందాల్ యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.

**శృంగవరపుకోట, ఫిబ్రవరి 21:** జిందాల్ సౌత్ వెస్ట్ అల్యూమినా పరిశ్రమ స్థాపనకు 2007లో శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, మూలబొడ్డవర, చినఖండేపల్లి, చీడిపాలెం, ముషిడిపల్లి గ్రామ పరిధిలో 1127.76 ఎకరాల వరకు భూసేకరణ చేశారు. ఇందులో ప్రభుత్వ భూములు 208.54 ఎకరాలు, డి.పట్టా భూములు 919.22 ఎకరాల వరకు ఉన్నాయి. ఈ భూముల న్నింటినీ అత్యధిక శాతం గిరిజన నిరుపేద రైతులు సాగు చేసేవారు. ప్రస్తుతం ఆ భూములు బొడ్డవర వయా తాటిపూడి విజయనగరం రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. సమీపంలోనే తాటిపూడి జలాశయం ఉంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నారు. ఆయన ఆదేశాల మేరకు భూసేకరణకు రంగం సిద్ధమైంది. భూములే జీవనాధారంగా బతుకు తున్న గిరిజనులకు వాటిని వదులుకొనేందుకు ఏమాత్రం ఇష్టం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఒత్తిడి చేయడంతో ఎదురు చెప్పలేక భూములు వదులుకున్నారు. అప్పట్లో ఎకరాకు రూ.2,00500 చొప్పున రైతులకు పరిహారంగా చెల్లించారు. ఇందుకు సమానమైన సొమ్మును పరిశ్రమలో షేర్లుగా పెడతామని మాటిచ్చారు. నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగం ఇస్తామన్నారు. ఇదంతా జరిగి పదహారేళ్లు దాటి పోయింది. సేకరించిన భూమిలో ఇంతవరకు పునాదిరాయి కూడా పడలేదు. భూములిచ్చిన నిర్వాసిత కుటుంబాలు కూలీలుగా మారారు. జీవనోపాధి దెబ్బతినడంతో పిల్లలకు సరైన చదువు చెప్పించలేకపోతున్నారు.

- జిందాల్ పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు బాక్సైట్. ఇది అరకు, అనంతగిరి కొండల్లో లభ్యమవుతుంది. దీన్ని తవ్వేందుకు అక్కడ నివశిస్తున్న గిరిజనులు అంగీకరించలేదు. తిరుగుబాటు చేయడంతో ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలను నిషేధించింది. ఈనేపథ్యంలోనే పరిశ్రమ నిర్మించలేదు. కాబట్టి భూములను తిరిగివ్వాలని రైతులు కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.
- షేర్ల రూపంలో పెట్టిన డబ్బులను తిరిగి ఇచ్చేస్తామని కొన్నాళ్లుగా పరిశ్రమ యాజమాన్యం రైతులకు చెబుతోంది. అయితే అప్పట్లో ఎంత సొమ్ము కట్టారో అంతే తిరిగి ఇస్తామంటోంది. ఆ డబ్బులను అప్పుడే బ్యాంకులో డిపాజిట్ చేసి ఉంటే కనీసం రెండింతలై ఉండేదని రైతులంటున్నారు. ఈ విషయమై నిర్వాసిత రైతుల మధ్య విభేదాలు నడుస్తున్నాయి.




జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములు

## యాజమాన్యం పట్టించుకోకే రిలే దీక్షలు

పరిశ్రమ స్థాపిస్తామని జిందాల్ సౌత్ వెస్ట్ అల్యూమినియం (జిందాల్) యాజమాన్యం భూములను సేకరించింది. భూములిచ్చిన రైతులు, వారి పిల్లలకు ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పింది. అప్పట్లో పరిహారం కింద ఎకరాకు రూ.200500 ఇచ్చింది. ఇదే సొమ్ముకు సమానమైన డబ్బులను స్టాక్‌మార్కెట్‌లో పెడతామంది. ఇప్పటికీ పరిశ్రమను నిర్మించని యాజమాన్యం ఇప్పుడు అవే డబ్బులు ఇస్తాం తీసుకోండని అంటోంది. ఆ సొమ్మును బ్యాంకులో వేసినా చాలా వడ్డీ వచ్చుండేది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.కోట్లు పలుకుతోంది. పరిశ్రమ యాజమాన్యం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో రిలే దీక్షలకు దిగాల్సి వచ్చింది.

– సత్యనారాయణ, అధ్యక్షుడు, జిందాల్ నిర్వాసితుల సంఘం

## జిందాల్ కొత్త పల్లవి

నిర్వాసిత రైతులు ఎదురు తిరుగుతుండడంతో జిందాల్ యాజమాన్యం కొత్తపల్లవి అందుకుంది. ఎంఎస్ఎంఈ(మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పార్కును నిర్మిస్తున్నామంటూ చెబుతోంది. ఏడాది క్రితం నుంచి పరిశ్రమ యాజమాన్యానికి చెందిన కనకారావు నోటి నుంచి ఈ మాట వినిపిస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన పనులేవీ ఎక్కడ కనిపించడంలేదు. కాగా జనవరి నెలాఖరులో ఈఎంఎస్ఎంఈ పార్కుకు సీఎం జగన్ శంఖుస్థాపన చేస్తారని ప్రచారం చేశారు. ఆ తరువాత ఫిబ్రవరి 15,16 తేదీల్లో ఉండొచ్చునని పేర్కొన్నారు. అయితే ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నమన్న జిందాల్ యాజమాన్యం అందులో ఎటువంటి పరిశ్రమ స్థాపిస్తుందో చెప్పడం లేదు. కనీసం ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్ద కూడా ఆ వివరాలు లేవు.




రెండో రోజు దీక్షలో జిందాల్ భూ నిర్వాసితులు

## వేరే పరిశ్రమలకు ఎలా ఇస్తారు?

**శృంగవరపుకోట రూరల్:** పదహారేళ్ల క్రితం తమను బతిమలాడి జిందాల్ కంపెనీ ఏర్పాటు చేస్తాం సహకరించండని వేడుకున్న యాజమాన్యం ఇప్పటివరకు ఎటువంటి పరిశ్రమ పెట్టకుండా తమను రోడ్డున పడేసిందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏకంగా పారిశ్రామిక వాడ పెడతామని చెబుతోందని, కనీసం భూములు ఇచ్చిన రైతులకు ఒక్కమాట చెప్పకుండా ఎలా ఒప్పందాలు చేసుకుం టుందని ప్రశ్నించారు. కంపెనీ కార్యాలయం వద్ద బుధవారం రెండోరోజు రిలే దీక్ష చేపట్టారు. తమ డిమాండ్లు తీరే వరకు నిరసన కొనసాగుతుందన్నారు.

# మైనర్లను వినియోగించొద్దు

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి**



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

మైనర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగించవద్దని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఆమె బుధవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. మైనర్లను ప్రచారానికి వినియోగించిన ట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈఆర్వో స్థాయిలో అధికారులు రాజకీయ పక్షాలతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించి అందుకు అనుగుణంగా తుది పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం చేయాల న్నారు. కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటానికి లేదా ఉన్న వాటిని వేరే ప్రదేశానికి మార్చేందుకు అవకాశం లేదని, అయితే ఒకే ప్రాంగణంలోని వేరొక గదుల్లోకి, భవనంలోకి మార్చుకునే వెసులుబాటు మాత్రమే ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల జాబితాను మార్చి 5లోగా ఖరారు చేసి ఎన్నికల సంఘానికి పంపించాల్సి ఉందన్నారు. ఓటర్ల జాబితాలో పెద్దగా మార్పులు లేవని, ఓటర్లకు అవగాహనా కార్యక్రమాలను ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే ముమ్మరం చేస్తామన్నారు. వీవీ ప్యాట్ల పనితీరుపైనా ఓటర్లకు వివరిస్తామన్నారు. జిల్లాలోని లక్ష్మీపురం, మల్యాడ, ముంజేరు తదితర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.




కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

# మీడియాపై దాడులు అరికట్టాలి

- ప్రతి ఒక్కరూ ఖండించాలి
- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి
- విజయనగరంలో జర్నలిస్టు సంఘాల ఆందోళన

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

'మీడియాపై గూండాల దాడులు నివారించాలి.. దాడులు ప్రజాస్వామ్యంపై గొడ్డలిపెట్టు... మీడియాపై దాడులను వెంటనే అరికట్టాలి... దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలి..' అంటూ జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. మీడియాపై దాడులను ఖండిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడులకు పాల్పడ్డ సంగతి తెలిసిందే. అలాగే కర్నూలు మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కె.వీరశేఖర్‌పైనా వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. కర్నూలు ఈనాడు కార్యాలయంపై రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాలు బుధవారం విజ యనగరంలో ఆందోళనకు దిగాయి. ఎన్నికలు దగ్గరప డుతున్న పరిస్థితిలో మీడియా ప్రతినిధుల రక్షణకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. మీడియాపై దాడులు ప్రజాస్వామ్యా నికి గొడ్డలిపెట్టని, ఇది మంచి సంప్రదాయం కాదని అన్నారు. నిరసనలో జర్నలిస్టు సంఘాల నాయకులు బూరాడ శ్రీనివాసరావు, శివప్రసాదరావు, పాత్రో మాట్లాడుతూ మీడియాపై దాడులను తీవ్రంగా ఖండించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

# త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



పంట కాల్వలోకి దూసుకుపోయిన పాఠశాల బస్సు

- పంటకాల్వలోకి దూసుకెళ్లిన బస్సు
- ఆటోను తప్పించే క్రమంలో ఘటన
- బస్సులో 40మందికి పైగా పాఠశాల పిల్లలు
- మహిళకు తీవ్ర గాయాలు

**శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 21 :** కొత్తురు గ్రామం వద్ద బుధవారం సాయంత్రం ప్రైవేటు పాఠశాల బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్న ఎస్.కోట రామన్ పాఠశాల బస్సు కొత్తూరు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో పంటకాల్వలోకి దూసుకు పోయింది. ఆ సమయంలో బస్సులో 40 మందికి పైగా ఉన్నారు. ఈ ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే..

వేపాడ, ఎస్.కోట మండలాల విద్యార్థులను వారి ఇళ్లవద్ద దింపేందుకు ఎస్.కోట రామన్ పాఠశాల నుంచి స్కూల్‌బస్సు బుధవారం సాయంత్రం నాలుగుగంటల సమయంలో బయలుదేరింది. కొత్తూరు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటోలో నుంచి ఓ మహిళ దిగింది. ఆ ఆటో వెనుకే మరో స్కూల్ ఆటో ఆగి ఉంది. ఆ వెనుక వస్తున్న స్కూల్‌బస్సు ఆటోను స్వల్పంగా ఢీకొట్టింది. పెద్ద ప్రమాదం జరగకుండా డ్రైవర్ బస్సును వెంటనే పక్కకు తిప్పాడు. ఈక్రమంలో బస్సు పంటకాల్వలోకి దూసుకుపోయింది. అంతే భయంతో పిల్లలు హాహాకారాలు చేశారు. సమీపంలో ఉన్న యువకులు వచ్చి బస్సులో వున్న పిల్లలను కిందకు దించారు. కొంతమంది పిల్లలు బస్సు అద్దాలను విరగ్గొట్టి బయటకు దూకేశారు. అయితే ఆటో దిగిన వెంకటరమణపేట గ్రామానికి చెందిన మహిళ వేంకటేశ్వరమ్మ బస్సు చక్రంలో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడింది. ఆమెను విశాఖ కెజీహెచ్‌కు పంపించారు.

# డబ్బులు వసూలు చేసి.. బోర్డు తిప్పేసి

- పేదలకు కుచ్చుటోపీ పెట్టిన సంస్థ
- ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** వారంతా కష్టజీవులు.. చెన్నై, హైదరాబాద్, గోదావరి, కృష్ణా జిల్లాలకు వలస వెళ్లి కాయకష్టం చేసుకొని పైసాపైసా కూడబెట్టుకున్నారు. ఆ డబ్బులన్నీ కొన్నేళ్ల కిందట ఓ బోగస్ కంపెనీకి ఇచ్చారు. డబ్బులు రెండింతలు అవుతాయని ఆ వ్యక్తులు చెప్పడంతో నమ్మేశారు. సంవత్సరాలు గడిచినా స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించారు. బొబ్బిలి మండలం కొండదేవుపల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది బాధితులు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చి తమ మొర వినిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఢిల్లీకి చెందిన ఓ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ తరఫున కొంతమంది ఏజెంట్లు కొన్నేళ్ల కిందట కొండదేవుపల్లి వెళ్లి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. ఒక్కొక్కరి వద్ద పదివేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పైగా తీసుకున్నారు. ఐదు సంవత్సరాల తర్వాత రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చారు. పాపం పేదలు ఆశ పడి ఆ సంస్థలో డిపాజిట్ చేసుకున్నారు. అయితే సంస్థ ప్రతినిధులు బొబ్బిలి పట్టణంలో బ్రాంచి కార్యాలయం పెట్టి ఆ తరువాత బోర్డు తిప్పేశారు. 2014లో దాచుకున్న ఈ డబ్బుకు ఇంతవరకు ఎటువంటి గ్యారంటీ గాని, తిరిగి చెల్లింపులు గాని జరగలేదు. ఇప్పటికి తాము మోసపోయామని గ్రహించిన స్థానికులు గ్రామపెద్దల దగ్గర పంచాయితీ పెట్టారు. ఏజంట్‌ను పిలిపించి అడిగితే ఆ సొమ్మును తానేమీ తినేయలేదని, కోఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్ చేశామని, వారు చెల్లించాలని తెలిపాడు. చేసేదిలేక బాధితులంతా బుధవారం సాయంత్రం బొబ్బిలి పోలీసు స్టేషన్‌కు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు.

## బాధితులు వచ్చి కలిశారు

**మలిరెడ్డి నాగేశ్వరరావు, సీఐ, బొబ్బిలి**

కొండదేవుపల్లి గ్రామం నుంచి కొంతమంది మహిళలు వచ్చి కొన్ని బాండ్లు చూపించారు. ఆరేళ్ల నుంచి గ్రామంలో దీనిపై గొడవలు జరుగుతున్నా యన్నారు. ఎవరెవరు ఎంతెంత డిపాజిట్లు చేశారు? బాండ్ల జిరాక్స్‌లను జోడించి సమగ్రంగా ఫిర్యాదు అందించాలని వారికి సూచించాం. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం.



బాండ్లు చూపుతున్న బాధితులు

## ఆరు పథకాలపై అవగాహన కల్పించండి

**రాజాం:** మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోండ్రు మురళీమోహన్ సూచించారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం వంగర మండలం రుషింగి, తలగాం, గీతానాపల్లి, వీవీ ఆర్ పేట, కొండచాకారాపల్లి, కొప్పరవలస, కోణింగిపాడు, ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస పంచాయతీలు టౌన్ 1, 2, 3, 4 వార్డుల నాయకులతో కలిసి రివ్యూ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వైసీపీ అరాచకాలు, భూకబ్జాలు, ఇసుక దోపిడీ తదితర అంశాలపై వివరించాలన్నారు.

## సీతారామాలయ ప్రారంభోత్సవం

**బాడంగి:** కామన్నవలస గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జడ్పీటీసీ రామారావు, తెంటు మధు, బేతనపల్లి శంకరరావు, జేసీఎస్ కన్వీనర్ శంకరరావు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'చలో కాకినాడ'ను విజయవంతం చేయాలి

**బాడంగి:** చలో కాకినాడ కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఆంధ్రా మాల మన అధ్యక్షుడు ఎండ గోపాలరావు కోరారు. బుధవారం ఆయన చలో కాకినాడ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వైవై మోహన్, గౌతమ్, వై.వంశీకృష్ణ, పి.సమేల్ పాల్గొన్నారు.

## నారీమన్ మృతికి సంతాపం

**కొత్తవలస:** ప్రముఖ న్యాయ కోవిదుడు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి నారీమన్ మృతికి కొత్తవలస న్యాయవాద సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సీనియర్ న్యాయవాది మృతి న్యాయ వ్యవస్థకే తీరని లోటని న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు అన్నారు. కొత్తవలస న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ న్యాయవాదులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## అనాథలకు ఆర్థిక సాయం

**కొత్తవలస:** కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలోని అనాథ, వృద్ధాశ్రమాల వారికి బుధవారం భోజన సదుపాయంతో పాటు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. పెందుర్తిలోనున్న వృద్ధాశ్రమంలో 100 మందికి భోజనంతో పాటు పురుషులకు దుప్పట్లు, మహిళలకు చీరలను అందజేశారు. ఆశ్రమ నిర్వహణకు రూ.10 వేలు అందజేశారు. చైతన్య మానసిక పాఠశాలకు చెందిన 45 మంది పిల్లలకు భోజనం, దుస్తులు ఇచ్చారు. బలిఘట్టాంలో ఉన్న న్యూహోప్‌లో అనాథ పిల్లలు 50 మందికి దుస్తులు, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు సేవా కార్యక్రమాలలో డి. శ్రీరామ్, విజయలక్ష్మి, సునీత, తనూజ భాగస్వాముల య్యారని వ్యవస్థాపకుడు కనకాల శివ తెలిపారు.

## ఎయిడ్స్‌పై అవగాహన

**కొత్తవలస:** వీరభద్రపురం గ్రామంలో బుధవారం ఎయిడ్స్ వ్యాధిపై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా వస్తుంది? రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో వివరించారు. సర్పంచ్ గేదెల గురుమూర్తి, వైద్య సిబ్బంది అనూష తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజారులో స్టాల్స్ ప్రారంభం

**విజయనగరం రింగురోడ్డు:** నగరంలోని రింగురోడ్డు రైతుబజారులో బుధవారం ఆధునీకరించిన స్టాల్స్‌ని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు బజార్లలో దుకాణాలు శిథిలమైన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో ఆధునికీకరణకు ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశామన్నారు. దాదాపు 30 దుకాణాల వరకూ ఆధునీకరించి ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. నగరాభివృద్ధిలో భాగంగా రైతు బజార్లలోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ పనులు చేశామన్నారు. కార్పొరేటర్లు గాదం మురళి, రైతుబజారు ఏఓలు నాయుడు, ఉమామహేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో కాంగ్రెస్ ఇన్‌చార్జి

**రాజాం:** రాజాం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల రాజవర్ధన్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మెగా డీఎస్సీ డిమాండ్ కోసం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు చలో సెక్రటేరియట్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూని అయ్యిందన్నారు.

## పైడిమాంబను దర్శించుకున్న నిత్య విద్యానంద భారతీ స్వామీజీ



**విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబను ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్య విద్యానంద భారతి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# టీడీపీ-జనసేనకు మద్దతు ఇవ్వండి

● **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు**

**విజయనగరం రూరల్, ఫిబ్రవరి 21:** టీడీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా వెళ్లేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ రెండింటిని వదిలేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ తిరోగమనంలోకి వెళ్లిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. నగరంలోని 45వ డివిజన్‌లో కేఎల్‌పురంలోని కొండవీధి, రెవెన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, మొదలగు ప్రాంతాల్లో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టీడీపీ హయాంలో పేదల సంక్షేమానికి ఏర్పాటు చేసిన పలు పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అన్న క్యాంటీన్‌లు, క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి కానుకలను రద్దు చేశారన్నారు. చంద్రబాబు పెళ్లి కానుక, చంద్రన్న బీమా.. ఇలా అన్ని పథకాలను రద్దు చేయడం ద్వారా పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళా సాధికారిత, ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా గ్రూప్‌లు ఏర్పాటు చేసి, వారిలో చైతన్యం నింపిన ఘనత టీడీపీదేనన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ శోభారాణి, పెనుమత్స శ్రీను, పి వెంకట మురళీతో పాటు నగర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



45వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు

## టీడీపీలో 70 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో బేబీనాయన

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** బొబ్బిలి మున్సిపాలిటీ 21వ వార్డు పరిధిలో ఇందిరమ్మ కాలనీకి చెందిన సుమారు 70 కుటుంబాల వారు బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు జక్కువ చంద్రశేఖర్, యాళ్ల వెంకటరమణ, రావాడ గోపి, తెర్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో వారంతా బొబ్బిలి కోటకు వచ్చి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పట్టణంలో భారీ మెజారిటీ వచ్చే విధంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరమని, టీడీపీ-జనసేన పార్టీలను అధికారంలోకి తేవడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రామ్మోహన్, సామిరెడ్డి శ్రీరాములు, సింగిరెడ్డి త్రినాథ, యర్రా జగదీశ్, పట్నాల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం లేకుండా కంపెనీని విస్తరించండి

**లక్కవరపుకోట, ఫిబ్రవరి 21:** కాలుష్యం లేకుండా... చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కంపెనీని విస్తరించుకునేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని వివిధ గ్రామాల ప్రజలు డీఆర్వో అనితకు తెలియజేశారు. ఆర్జీపేట వద్ద గల మా మహామాయ కంపెనీ యాజమాన్యం విస్తరణ కోసం డీఆర్వో ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఉత్పత్తులను రెండింతలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశామని సంస్థ ఎమ్‌డీ అగర్వాల్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో కూడిన కర్మాగారాన్ని నిర్మిస్తామని తెలిపారు. దీనిపై స్థానిక పంచాయతీలు శ్రీరాంపురం, ఆర్జీపేటల గ్రామ పెద్దలు, గ్రామస్తులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుతం కాలుష్యం ఎక్కువగా ఉందని.. దానిని అరికడుతూ కొత్త కంపెనీ నిర్మించుకునేందుకు ఎటువంటి అభ్యతరం లేదని వడ్లమాని శేషావతారం, పి.కిష్టప్పదొర, జి.అప్పన్నదొరలు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు సరిత, ప్రసాదరావు, తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ గోపాలరావు, గ్రామస్థులు రంది శంకరరావు, జె.కన్నబాబు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో అనిత

## జ్ఞాన సరస్వతి విగ్రహం ఏర్పాటు

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని సంతగైరమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విజయనగరం శారదీ సేవాసంఘం ఈ విగ్రహాన్ని అందించగా దీనిని వేద మంత్రాల మధ్య పాఠశాల హెచ్ఎం బంగారు నాయుడు, గ్రామపెద్దలు గోగాడ సత్యం మాస్టారు, గోగాడ సన్యాసిరావు, గోగాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రతిష్ఠించారు. విగ్రహానికి పైకప్పును గోగాడ సత్యం మాస్టారు సోదరులు ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖాధికారి నరసింగరావు, సర్పంచ్ కళావతి తదితరులున్నారు.



జ్ఞానసరస్వతి విగ్రహావిష్కరణ దృశ్యం

## ప్రమాదాలను అరికట్టండి

**విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 21:** నగరంలోని 42వ డివిజన్ కామాక్షి నగర్ ప్రధాన రహదారి నిత్యం పాఠశాల పిల్లలతో రద్దీగా ఉంటుందని... తక్షణమే స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలను అరికట్టాలని నగర అభివృద్ధి వేదిక కన్వీనరు త్యాడ రామకృష్ణారావు కోరారు. బుధవారం జాతీయ రహదారుల డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమణను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని... స్పీడు బ్రేకర్లను వేసి... నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణారావు

## ఆక్రమణలను అడ్డుకోండి

● **జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పలస్వామి**

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో గల అన్ని మండలాల్లో అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా సాగించిన భూ కబ్జాలు, ఆక్రమణల పర్వాలను అధికార యంత్రాంగం అడ్డుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామభద్రపురం మండల కేంద్రంలో సుమారు రూ.పది కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు దర్జాగా కబ్జా చేసేశారని...హైకోర్టు ఆదేశాలతో దీనికి చెక్ పడిందన్నారు. జనసేన మహిళా నేత, మాజీ మంత్రి పడాల అరుణతో కలిసి స్థానిక తహశీల్దారు, రెవెన్యూ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వారు కబ్జాను అడ్డుకున్నారన్నారు. దీనికోసం పోరాటం సాగించిన జనసేన నాయకులు మహంతి ధనుంజయ, భవిరెడ్డి మహేశ్‌ల విజయంగా ఆయన అభివర్ణించారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో భూకబ్జాలను అధికారులు అడ్డుకొని ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని గిరడ అప్పలస్వామి కోరారు. ఈ సమావేశంలో మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలస్వామి

## రెండో విడత నిధులు విడుదల చేయాలి

● **సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు**

**రామభద్రపురం, ఫిబ్రవరి 21:** గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి రాంబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులు వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి నివారణకు, గ్రామాల్లో పారిశుధ్య పనులకు, డయేరియా వంటి వ్యాధుల నివారణకు ఉపయోగ పడతాయని అన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో నిధుల సమస్య వేధిస్తున్నందున 15వ ఆర్థిక సంఘ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. అనేక గ్రామ పంచాయతీల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల కొత్త భవనాల నిర్మాణం జరిగాయని... బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. జల జీవన్ మిషన్ కొత్త కమిటీలు వేయడం వల్ల సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్.సీతారాంపురం సర్పంచ్ పాలవలస యమున, జన్నివలస సర్పంచ్ జన్ని సారంగదొర, కొండకెంగువ సర్పంచ్ కంచుబిల్లి సుజాత పాల్గొన్నారు.



విలేఖర్లతో మాట్లాడుతున్న రాంబాబు

## పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరం

**విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 21:** పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల సమయంలో నిరంతరం పర్యవేక్షణ అవసరమని... ఆ బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షా పర్వా పాయింట్స్ 6, పాయింట్స్ 0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సైబర్ నేరాలకు బాలలే ఎక్కువగా బలి అవుతున్నారన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల వసతి గృహాల్లో పర్యవేక్షణ ఉండాలన్నారు. చిట్టిబాబు, డైట్ ప్రిన్సిపాల్ తవిటి నాయుడు, డీఈవో ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతకు మారి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

## ఉపాధి పనులు పరిశీలన

**బాడంగి, ఫిబ్రవరి 21:** లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎండొర చెరువులో ఉపాధి పనులను ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ మస్టర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, గైర్హాజరైన వారి పేర్లను వేయవద్దని సూచించారు. రెండు పూటలా ఉపాధి కూలీలు పనులు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

## డొంకలు, తుప్పల్లో సర్వేరాళ్లు

**పట్టించుకోని రెవెన్యూ అధికారులు**

**రామభద్రపురం, ఫిబ్రవరి 21:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భూముల రీసర్వే మండలంలో అభాసుపాలవుతోంది. దీని కోసం తెచ్చిన సర్వే రాళ్లు డొంకలు, తుప్పల్లో పడి ఉంటున్నాయి. 2020 నవంబరులో అట్టహాసంగా రీసర్వే మొదలుపెట్టారు. ఇప్పటికీ సర్వే అస్తవ్యస్తంగా సాగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రీసర్వేలో సిబ్బంది లీలలు ఒక్కొక్కటిగా బయట పడడంతో ప్రజాప్రతినిదులు, రైతులు అవాక్కవుతున్నారు. సర్వే కోసం మండలానికి 16 వేల సర్వే రాళ్లు తెప్పించారు. వీటిని ఎక్కడపడితే అక్కడ వదిలేసి తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో సర్వే రాళ్లు తుప్పలు, డొంకలకే పరిమి తమయ్యాయి. నాయుడు వలస, మర్రివలస గ్రామాల మధ్య ఇవి దర్శనమిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులు సర్వే రాళ్లను సొంత అవసరాలకు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది.



డొంకలు, తుప్పల్లో ఉన్న భూముల రీసర్వే రాళ్లు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని..

● **బాలుడి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**



లక్ష్మణరావు (ఫైల్)

**డెంకాడ, ఫిబ్రవరి 21:** రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావు(17) స్థానికంగా ఓ కాలేజీలో ఐటీఐ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్వగ్రామమైన పినతాడివాడ నుంచి గొడ్డుపాలెం గ్రామం మీదుగా జొన్నాడలో జరుగుతున్న గ్రామ దేవత పండగకు తన స్నేహితుడు వాసుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ సమయంలో గొడ్డుపాలెం నుంచి పినతాడివాడ వైపు వస్తున్న ఒక గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో లక్ష్మణరావు తలకు బలమైన గాయం తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు వాసుకి తీవ్ర గాయాలయ్యాయి. మృతుని తల్లిదండ్రులు రామలక్ష్మి, రామారావు రోజు వారీ కూలీలుగా పని చేస్తూ తమ పిల్లలను పోషించుకుంటున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుంకరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డెంకాడ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## పిన్నవలసలో చెరుకు పంట దగ్ధం

**బాడంగి:** పిన్నవలస గ్రామంలో నౌడు కృష్ణ, వాకాడ సుశీల, నౌడు పాపినాయుడుతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన సుమారు 110 టన్నుల చెరుకు బుధవారం దగ్ధమైనట్టు రైతులు తెలిపారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదని వారు వాపోయారు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పంచాయతీరాజ్ ఇంజినీర్ల ధర్నా



బొబ్బిలి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ జేఏసీ పిలుపు మేరకు స్థానిక ఈఈ కార్యాలయం ముందు బుధవారం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ధర్నా చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి విజిలెన్స్ విచారణలు, తదితర వేధింపులకు నిరసనగా ఈ ఆందోళన చేపడుతున్నట్లు సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ సీహెచ్‌వీ అప్పారావు తెలిపారు. బిల్లులు అందని వారు దాడులకు దిగుతున్నారని, తీవ్రమైన మానసిక ఒత్తిడి గురవుతున్నామని వాపోయారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడు నెలలుగా జీతాలు లేవని, రెండేళ్లుగా వాహనాల అద్దెలు, ఎఫ్‌టీఏలు చెల్లించడం లేదన్నారు. నూతనంగా జిల్లాలు, డివిజన్లు ఏర్పాటైనందున కొత్త పోస్టులను మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసులు, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సీటు కేటాయించాలి

**కలెక్టరేట్, ఫిబ్రవరి 21:** వచ్చే ఎన్నికల్లో తమ కులానికి ఎంఎల్ఏ సీటు కేటాయించాలని యాదవ సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల నిరసన దీక్ష బుధవారంతో ముగిసింది. దీక్షలో పాల్గొన్న నాయకులకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ నాయకులు ఇసరపు శేఖర్ యాదవ్ నిమ్మరసం ఇచ్చి విరమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన తమ కులానికి ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ సీట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించిన రాజకీయ పార్టీలకే తమ సామాజిక వర్గ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాయికిరణ్ యాదవ్, పడాల గణేష్, బోని సతీష్, బోర వాసు, ఆవాల సతీష్, బాలాజీ, కిరణ్ కుమార్, గొలగాణ రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



దీక్ష చేస్తున్న యాదవ సంఘ నాయకులు

## ర్యాంపుల నిర్మాణం పూర్తి చేయాలి

**వంగర, ఫిబ్రవరి 21:** పాఠశాలల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన ర్యాంపులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో దుర్గారావు సూచించారు. బుధవారం వంగర, కొప్పర, సంగాం తదితర గ్రామాల్లో పర్యటించి అర్థాంతరంగా నిలిచిన ర్యాంపులను పరిశీలించారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదుతో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. హెచ్ఎంలు రామకృష్ణ, గిరి తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎంఈవో

## ప్రధాన రహదారిపై మురుగు

**వంగర, ఫిబ్రవరి 21:** సీతారాంపురం బీసీ బాలుర వసతి గృహ సమీపంలో మురుగునీరు ప్రధాన రహదారిపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రధాన రహదారితో పాటు పాఠశాలకు వెళ్లే మార్గంలో మురుగునీరు రహదారిపైకి రావడంతో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు.

సీతారాంపురం వసతి గృహం ముందు మురుగునీరు



## సీపీఎస్ రద్దు చేయండి

**వంగర, ఫిబ్రవరి 21:** సీపీఎస్‌ను రద్దు చేయాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఉపాధ్యాయ నాయకులు మజ్జి ప్రసాద్, శ్రీధర్ తదితరులు హెచ్చరించారు. మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట బుధవారం వారు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు జగన్ హామీలు గుప్పించి.. అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన వాటిని తుంగలో తొక్కడం సబబు కాదన్నారు. ఈ మేరకు ఎంపీపీ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యాక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపీపీకి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

# మాతృభాషను పరిరక్షించుకుందాం

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భాషా పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని రోటరీక్లబ్, కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. బుధవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం ముందు గల తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు నడుంబిగించిన భాషాభిమానులు, మేధావులందరికీ మద్దతుగా నిలవాలన్నారు. తెలుగు అధ్యాపకుడు బొంతు శ్రీరాములు మాట్లాడుతూ ఎన్ని భాషలను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను ఎట్టిపరిస్థితుల్లో విస్మరించరాద న్నారు. తెలుగు భాష ప్రాశస్త్యాన్ని, గొప్పతనాన్ని నేటి బాలలు కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. శ్రీకృష్ణదేవరాయలతో పాటు తెలుగు కవులు ఎంతోమంది ఇందుకోసం చేసిన కృషిని మన మంతా కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. తెలుగు లెక్చరర్ బొంతు శ్రీరాములు, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం నాయకుడు కేతిరెడ్డి చంద్ర, భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని ధర్మవరం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత చలం మాస్టారిని మాతృ భాష దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో సత్కరించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలుగుభాష ఉన్నతికి ఎంతో కృషిచేస్తున్న చలం మాస్టారి గురించి విద్యార్థులకు వివరించారు. ● **రాజాం:** ఘనంగా మాతృభాష దినోత్సవం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం నిర్వహజించారు. తెలుగు ఉపాధ్యాయుడు మీగడ మల్లిఖార్జున స్వామి, దుర్గారావులను సత్కరించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, ఉపాధ్యక్షులు గట్టి పాపారావు, కోశాధికారి దామెర సీతారమేష్, సంస్థ సభ్యులు నాయుడు, పెంకి చైతన్యకుమార్, పాఠశాల కరస్పాండెంట్ గట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో..



ఎస్‌కోట రూరల్: ధర్మవరం పాఠశాలలో..



రాజాంలో..

## మల్లమ్మపేటలో కమిషనర్ పర్యటన

**బొబ్బిలి, ఫిబ్రవరి 21:** మల్లమ్మపేట గ్రామంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి బుధవారం పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామ శివారులో పారిశుధ్య లోపం తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని... మురుగు నీరు లోతట్టు ప్రాంతాలకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గొల్లపల్లి సచివాలయంలో ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

మల్లమ్మపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్



## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి: జేడీ



మాట్లాడుతున్న వెంకటకృష్ణారెడ్డి

**భోగాపురం:** ఉపాధ్యాయులు విద్యార్థులనుంచి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని మోడల్‌స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలి పారు. బుధవారం భోగాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో అకడమిక్స్‌పై సమీక్షిం చారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల స్థాయిని గుర్తించి వారి స్థాయి మేరకు మంచి ఫలితాలు రాబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి, సీబీఎస్‌ఈ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీలత, స్టేట్ ఏఎంవో కె.ధర్మకుమార్, ఏఎంవో ఎం.శరత్‌బాబు, ఎంఈవోలు రమణమూర్తి, చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతీ, జోన్-12, మోడల్‌స్కూల్స్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొబ్బరి తెగుళ్లపై దృష్టిసారించాలి

● సీబీడీ డైరెక్టర్ అరవల్


కొబ్బరితోటలో పరిశీలిస్తున్న అధికారులు

**భోగాపురం:** కొబ్బరి తెగుళ్లపై రైతులు దృష్టిసారించాలని సీబీడీ డైరెక్టర్ ఇ.అరవల్ తెలిపారు. బుధవారం మండలంలోని ముంజేరు, రావాడ, పూస పాటిరేగ మండలం చినపతివాడ, పతివాడ గ్రామాల్లోగల కొబ్బరి ప్రయోగ క్షేత్రాలను సందర్శించారు. ఈసందర్భంగా సాంకేతిక అంశాలు, కొబ్బరిలో చీడ, పీడల నివారణ, ఉద్యాన విస్తరణపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో శాస్త్రవత్తే బీవీకే భగవాన్, డీహెచ్‌వో జబద్నో, ఏడీహెచ్ శైలజ, ఉద్యాన అధికారి జి.జోష్న పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో కొండవెలగాడ ప్రతిభ

**నెల్లిమర్ల:** ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారుడు ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటా నగర్‌లో గురువారం జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బట్టు ఆదినారాయణ 81 కిలోల విభాగంలో స్నాచ్ 135 కిలోలు, క్లీన్ జర్క్ 160 మొత్తం 295 కిలోలు ఎత్తి... కాంస్య పతకం సాధిం చాడు. ఆదినారాయణను ఆర్టీసీ జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ గదల సన్యాసి నాయుడు, వెయిట్ లిఫ్టర్ మత్స సంతోషి, కోచ్ అర్జున్ అభినందించారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**నెల్లిమర్ల:** విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన సతివాడ జేటీఎన్‌ఎం కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరావు, సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం, గిరిజన సంఘ నాయకుల డిమాండ్

**సాలూరు రూరల్:** గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించిన తాజాగా బదిలీపై వెళ్లిన తహసీల్దార్ బాలమురళీకృష్ణ, వీఆర్వో కృష్ణమూర్తిలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘ నేతలు డిమాండ్‌చేశారు. బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులు నిరవధిక నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2020 నుంచి గాదెలవలస, బొర్రపణుకువలస, జిల్లేడువలస గిరిజనులకు అటవీ,బంజరు భూ పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తున్నామని,ఈవిషయమై సర్వే సైతం చేశారన్నారు. మూడు గిరిజన గ్రామాల్లో కేవలం గాదెలవలస గిరిజనులకే పట్టాలిచ్చి రెండు గ్రామాలను విస్మరించడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల గిరిజనుల మధ్య వైషమ్యాలు వచ్చాయన్నారు. ఇందుకు కార ణమైన బదిలీపై వెళ్లిన తహసీల్దార్ బాలమురళీకృష్ణ,వీఆర్వో కృష్ణమూర్తిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘనేతలు గాసి,చినబాబు మాట్లాడుతూ గిరిజనులమధ్య వివాదానికి కారణ మైన అధికారులపైచర్యలు తీసుకొని,పట్టాలిచ్చే వరకు నిరసన దీక్షలను నిరవధి కంగా కొనసాగి స్తామన్నారు. కార్యక్రమంలో కొత్తయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## 24న నాగావళి తీరంలో శ్రీచక్ర తీర్థ స్నానం

**గరుగుబిల్లి:** తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో బుధ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్స వాల్లో భాగంగా మూడో రోజు సుప్రభాత సేవ, నిత్యారాధన, విశేష హోమా లు, మంగళశాసనాలను ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ కల్యాణ మహో త్సవం ముగింపును పురస్కరించుకుని ఈనెల 24న నాగావళి నదీ తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వామవారికి, అమ్మవార్లకు శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థ స్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వేసవిలో జాగ్రత్తలు అవసరం: ఏపీడీ

**వీరఘట్టం:**వేసవి ఎండల కారణంగా వేతనదారులు పనుల వద్దకు మంచినీరు తీసుకొని వచ్చేలా చూడాలని అదనపు ప్రోగ్రాం అధికారి జి.శ్రీహరి రావు అన్నారు.ప్రస్తుతం మండలంలో 5,200 మంది వేతనదారులు ఉన్నారని.. వచ్చే గురువారం నాటికి ఈ సంఖ్యను 6వేలకు పెంచాలని సూచించారు. వేసవి కాలా న్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచిఆరు గంటల వరకు పనివేళల్లో మార్పులు ఉంటా యన్నారు.కార్యక్రమంలో ఏపీవో జి.సత్యనారాయణ, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రక్తహీనతతో బాధపడే వారిపై దృష్టి : పీడీ

**కొమరాడ:** గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎంఎం రాణి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కొమరాడ ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అనంతరం గంగరేగువలస- 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ప్రత్యేక ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీవో సుగుణ కుమారి, పాల్గొన్నారు.

## లెనిన్ బాటలో యువత నడవాలి

**పాచిపెంట:** లెనిన్‌బాటలో యువత నడవాలని సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు.బుధవారం పాచిపెంటలో కార్మిక సంఘాల నాయ కులు రెడ్‌బుక్‌డే సందర్భంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ విజ్ఞానం అనేది జీవన పోరాటంలోను, రాజకీయ రంగంలోను ఒక సాధనం అని అన్నారు. యువత చెడు మార్గంలోకి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

## రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

**దత్తిరాజేరు:** భూపాలరాజపురంలో రామాలయం పునర్నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యా లయంలో వలంటీర్లు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు భమ్మిడి అప్పల నాయుడు, మిత్తిరెడ్డి రమేష్, తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీడీవో చంద్రకుమారి పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకుప్రాధాన్యం

**గుర్ల:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. పున్నపు రెడ్డిపేటలో ఎంపీపీ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువలను బుధవారం ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలనాటి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.లక్ష్మి, ఉప సర్పంచ్ సత్యవతి, అప్పల నాయుడు, రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే దాడులు

● జర్నలిస్టులు, పత్రిక కార్యాలయాలపై దాడులు తగదు ●తెలుగుదేశం పార్టీ నాయకులు

ఓటమి భయంతోనే సీఎం జగన్ జర్నలిస్టులు, పత్రిక కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం వేర్వేరు చోట్ల టీడీపీ నాయకులు విలేక రులతో మాట్లాడారు. జర్నలిస్టులు, పత్రిక కార్యాలయాలపై దాడులు తగదని హితవుపలికారు. కాగా జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు నిరసనలు కొనసాగించారు.

### నియంతలకు చోటు లేదు: నాగార్జున



**చీపురుపల్లి:** ప్రతిపక్షాలు, పత్రికల గొం తునొక్కుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వంటి నియంతలకు ప్రజాస్వామ్యంలో చోటు కోల్పోయారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షు డు కిమిడి నాగార్జున తెలిపారు. ప్రతిపక్షాలపై ఉక్కుపాదం మోపిన ఆయన తాజాగా జర్నలి స్టులు, పత్రిక కార్యా లయాలపై దాడులు చే యించడం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ఓటమి భయంతోనే ముఖ్య మంత్రి ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. బుధవారం చీపురుపల్లి నాగార్జున విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై, ఈనాడు కార్యాలయంపై దాడులు ప్రజాస్వామ్యానికి సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విధ్వంసమే అజెండాగా ఎంచుకున్న ఆయన అధికారం నుంచి దిగిపోయే వరకూ దాన్నే నమ్ముకున్నట్టున్నారని నాగార్జున ఎద్దేవాచేశారు. పార్టీ మీటింగులు, అధికార సమావేశాల్లో కూడా తనకు నచ్చని మీడియా పేర్లు ప్రస్తావిస్తూ, తమ నైజాన్ని చాటు కుంటున్నారన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడంమంచిది కాదన్నారు.

### మీడియాపై దాడులు హేయం: కేఏ నాయుడు



**గజపతినగరం:**మీడియాపై రెండురోజు లుగా జరుగుతున్న దాడులు హేయమని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు తెలిపారు. బుధ వారం స్థానిక పార్టీ కార్యాల యంలో విలేకరు లతో మాట్లాడుతూ వాస్తవాలనుమీడియా కళ్లకుకట్టినట్లు చూపిం చడాన్ని ఓర్వలేక వైసీపీ నాయకులు దాడులకు దిగడం శోచనీయమ న్నారు. 2019లో అధికారంలోకి రాగానేమీడియా గొంతు నొక్కడానికి జగన్ జీవో తీసుకువచ్చారని, ఇప్పుడు ప్రత్యక్షంగా దా డులకు దిగడం దారుణమన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్, ఈనాడు దిన పత్రిక కార్యాలయంపై జరిగిన దాడులు బాధాకరమన్నారు. ఇన్ని జరిగినా జగన్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయనే చేయిస్తున్నారన్న అను మానం కలుగుతోందన్నారు. మీడియా స్వేచ్ఛను హరించడం దారుణమని తెలిపారు.

### ఉద్దేశపూర్వకంగానే దాడులు: బంగార్రాజు


భోగాపురం: మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

**భోగాపురం:** ఉద్దేశపూర్వకంగానే మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులపై దాడులు చేస్తున్నారని నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆరోపించారు. విలేకర్లపై దాడి చేయడం హేయమై నదని, ఇది జగన్ ఓటమికి దారితీయడం ఖాయమని తెలిపారు. పోలిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూప్రశ్నించే గళం వింటే జగన్‌రెడ్డికి వణుకని, అం దుకే ఆయనకు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, మీడియా అంటే భయం పట్టుకోవడంతో దాడులు చేస్తున్నారన్నారు. మీడియాపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమే అన్నారు. కార్యక్రమంలో మురపాక బోగేష్, కాకి బంగార్రాజు పాల్గొన్నారు.

### ప్రజలు బుద్ధిచెప్పడం తథ్యం: అదితి

**విజయనగరం రూరల్:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోయిందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. రాష్ట్రంలోని అమరావతి, అనంతపురం జిల్లా రాప్తాడు, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై దాడి ఘటనలను ఆమె ఖండించారు. టీడీపీ నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. భయంతో.. నిస్పృహలోనే ఈ దాడులకు వైసీపీ మూకలు తెగబడుతున్నాయ న్నారు. ప్రజావ్యతిరేక పాలన అవలంబించిన ఈ ప్రభుత్వంపై తిరుగుబాటు, ప్రశ్నించే వారి గొంతునొక్కారని, వారిపై దాడులు చేశారన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, మైలిపిల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

### దాడి అప్రజాస్వామికం: కోండ్రు


మాట్లాడుతున్న కోండ్రు

**రాజాం:** మీడియా స్వేచ్ఛను హరించే ప్రభు త్వం కనుమరుగవ్వడం ఖాయమని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరాభవం ఖాయమని తెలిసి, ఉద్దేశపూర్వకంగానే మీడియా సంస్థల ప్రతినిధులపై వైసీపీ రౌడీ మూకలతో సీఎం దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గళం వింటే జగన్‌రెడ్డికి వణుకుఅని, అందుకే ఆయనకు ప్రజలు, ప్రతిపక్షపార్టీలు, మీడియా అంటే భయం అని అన్నారు. దాడులు చేయడం దారుణమని మండిపడ్డారు.



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

# మీడియాపై దాడులను అరికట్టాలి

**జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన**

తక్షణమే మీడియాపై దాడులు అరికట్టాలని జర్నలిస్టులు, పలు ప్రజా సంఘాలు కోరాయి. ఈ మేకు బుధవారం అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడిచేయడాన్ని ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా బుధవారం జర్నలిస్టులు, పలు సంఘాల, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్‌చేశారు.

### ప్రభుత్వం బాధ్యత వహించాలి


మెంటాడ:: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

**మెంటాడ:** పాత్రికేయులు, పత్రికా కార్యాలయాలపై దాడులతో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం గొంతు నులిమే ప్రయత్నం చేస్తోందని... దీనిని అరికట్టాలని కోరుతూ మెంటాడ, గజపతినగరం మండలాల విలేకరులు బుధవారం స్థానిక తహసీల్దార్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల మీడియా ప్రతినిధులపై జరిగిన దాడులను ప్రస్తావించారు. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణ, కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని అన్నారు. ఈ దాడులకు జగన్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇటువంటివి పునరా వృతమైతే ప్రభుత్వం మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విలేకరులు చప్ప శివకేశవనాయుడు, కె.ఈశ్వరరావు, ఎస్.నాగభూషణం, వెంక టరావు సత్యనారాయణ, సత్యం, బుజ్జి, రామకృష్ణ, శంకరరావు, శ్రీను తదిత రులు పాల్గొన్నారు. అంతకుముందు వారు మెంటాడలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


నెల్లిమర్ల: మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

● **గరివిడి:** ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్, ఈనాడు కార్యాలయంపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దా డులు చేయడం దారుణమని టీజేఎఫ్ నాయకులు బి. గోపాల్, వి.గణేష్ పేర్కొన్నారు.ఈ మేరకు గరివిడి తహసీల్దార్‌కు చీపురుపల్లి నియోజకవర్గం విలేకరుల సంఘం (టీజేఎఫ్) నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడులు చేసిన వారిని క ఠినంగా శిక్షించి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతిని ధులు బి.రామారావు, కె.సత్యనారాయణ, బాలాజీ, రవి పాల్గొన్నారు.


గరివిడి: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీజేఎఫ్ నాయకులు

● **నెల్లిమర్ల:** మీడియాపై వైసీపీ నాయకుల దాడులను అరికట్టాలని సీపీఎం, సీపీఐ, న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మీడియా ప్రతినిధులు, కార్యాలయాలపై వైసీపీ చేస్తున్న దాడులను అరిక ట్టాలని కోరుతూ జరజాపుపేటలో గాంధీ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ నాయకుడు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం మాట్లాడుతూ పాత్రికేయులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ నాయకులు దాడులు చేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడులను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

# రెయిలింగ్ విరిగి.. పిల్లర్లు పటుత్వం కోల్పోయి..

● ఇదీ సారధిగెడ్డపై వందేళ్ల వంతెన దుస్థితి

**రాజాం రూరల్:** రాజాం-శ్రీకాకుళం రోడ్డులోని అంతకాపల్లి సమీ పంలో సారధిగెడ్డపై వందేళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరకుంది. వంతెన అడుగుభాగం పిల్లర్లు పటుత్వం కోల్పోవడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఐదేళ్ల కిందట భారీ లారీ ఢీకొన్న ఘటనలో పూర్తిగా విరిగిపోయిన రెయిలిం గ్‌కు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవి స్తున్నాయి. ఇక్కడ కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవతీసుకోకపోవడంతో చోదకులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఒడిశాలోని జైపూర్- బెర్హం పూర్ మధ్య వందలాది వాహనాలు ఇదే వంతెన మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తు న్నాయి.ఈ పరిస్థితుల్లో వంతెనకు ప్రమాదం సంభవిస్తే ప్రత్యామ్నాయం కూడా ఉండదన్న ఆందోళన నెలకొంది. తక్షణమే వంతెన నిర్మాణంపై అధికారులు ప్రతిపాదించాలని పలువురు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన వంతెన

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**భోగాపురం:** స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సభ్యులు హాజరుకావాలని కోరారు.

## మద్యం స్వాధీనం

**మెంటాడ:** అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆంధ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ దేవి అందించిన వివరాల ప్రకారం పోరాం గ్రామానికి సమీపంలో ముగ్గురు వ్యక్తుల నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శిరుగుడి కళ్లాల్లో ఇల్లు దగ్ధం

**భోగాపురం:** మండలంలోని శిరుగుడి కళ్లాల సమీపంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో శిరుగుడి అప్పలరాజు ఇల్లు దగ్ధమయ్యింది. బాధితుడి కథనం మేరకు.. ప్రమాదవసాత్తు అగ్ని ప్రమాదం జరగడంతో ఇంటితో పాటు పక్కనే ఉన్న పశువులశాల కూడా కాలిపోయింది. ఆసమయంలో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలడంతో బాధిత కుటుంబ సభ్యులు పరుగులు తీశారు. 25 బస్తాల బియ్యం, 30 బస్తా ధాన్యంపురి, ఆస్తికి సంబంధించిన దస్తా వేజులు, ల్యాప్‌టాప్ కాలిపోయాయి.విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ సూర్యకుమారి, వీఆర్వో శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తహసీల్దార్ శ్యామ్ ప్రసాదు, ఆర్‌ఐ కిషోర్ సంఘ టనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే గాలిపేటలో నీలగిరి తోటలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగిందని రెవెన్యూఅధికారులు తెలిపారు.

## పాఠశాలలో లెర్నింగ్ ప్రోగ్రాం పరిశీలన

**గరివిడి:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రాం అమలు తీరును బుధవారం వి.ఈశ్వరరావు, సీహెచ్‌ఎన్ దొరల బృందం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌ఐపీ అమలు తీరును మెరుగుపరచడానికి సూచనలు చేశారు. ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.లీలాకుమారి పాల్గొన్నారు.

## పోలీసుల సేవలకు అవార్డులు

**గుర్ల:** గుర్ల పోలీసు స్టేషన్‌లో పనిచేసే కామేశ్వరరావుకు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్స వం సందర్భంగా అవార్డు లభించింది. నెల్లూరు జిల్లాకు చెందిన పినాకిని వెల్ఫేర్ సంస్థ వారు రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో స్వచ్ఛంద సేవలు అందించిన 10 మందికి, వివిధ రంగా లలో సేవలు అందించిన వారికి సేవా పురస్కారాన్ని విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో అందజేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న బి.కామేశ్వరరావు కూడా వృద్ధమిత్ర కోఆర్డినేటర్ అవార్డును అందుకున్నారు. ఏఎండీఈ ఇంతియాజ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సమరం, ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ వి.హజరత్తయ్య, పినాకిని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎం మోహనరాజు ఈ అవార్డును ప్రదానం చేశారు.